ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర
సంపుటి : 13
సంచిక : 272
పేజీలు : 5 వెల రూ. 2/-
మంగళవారం
27 డిసెంబర్ 2025
PUBLISHED FROM :
HYDERABAD

# AM న్యూస్

ప్రతిదినం ప్రత్యేకం

www.amnews7.com

## ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో పరిణామం

### బిఆర్ఎస్ మాజీ ఎంపి సంతోష్‌కు సిట్ నోటీసులు



ఏఎం న్యూస్, హైదరాబాద్,జనవరి26:
సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో భాగంగా సిట్ అధికారులు తాజాగా బీఆర్ఎస్ మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ రావుకు నోటీసులు జారీ చేశారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా, ఈ వ్యవహారానికి సంబంధించిన కొన్ని కీలక వాస్తవాలు సంతోష్ రావుకు తెలిసి ఉండవచ్చని భావిస్తున్నట్లు పోలీసులు నోటీసులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, విచారణ నిమిత్తం జనవరి 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జుబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలో స్వయంగా హాజరు కావాలని జుబ్లీహిల్స్ విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పి. వెంకటగిరి ఆదేశించారు. ఇప్పటికే ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులను విచారించిన సంగతి తెలిసిందే. ఐటీ చట్టం, ప్రభుత్వ ఆస్తుల నష్టం నిరోధక చట్టం వంటి కఠిన సెక్షన్ల కింద కొనసాగుతున్న ఈ విచారణలో సంతోష్ రావుకు నోటీసులు అందడం రాజకీయ వర్గాల్లో పెను కలకలం రేపుతోంది. రేపు మధ్యాహ్నం జరగబోయే ఈ విచారణలో సిట్ అధికారులు సంతోష్ రావు నుండి ఎటువంటి సమాచారాన్ని రాబడతారనే అంశంపై ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

## తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌తో పెరిగిన ఇమేజ్

- మూడు ఎకనమిక్ జోన్లుగా రాష్ట్ర విభజన
- సర్వతో ముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి
- మేడారం అభివృద్ధి కోసం రూ.251కోట్లు కేటాయింపు
- 26 లక్షల మంది రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ
- ధాన్యానికి బోనస్‌గా రైతులకు రూ.1,780కోట్లు అందచేత
- గణతంత్ర దినోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



2 లో

## అంబరాన్నంటిన గణతంత్ర వేడుకలు

- జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్రపతి ముర్ము
- ఆకట్టుకున్న సైనిక శకట ప్రదర్శన
- ప్రత్యేక ఆకర్షణగా ఆపరేషన్ సిందూర్ ఆయుధ వ్యవస్థలు
- ముఖ్య అతిథులుగా ఆంటోనియో కోస్టా, ఉర్సులా వాన్‌డెర్ లేయెన్
- ప్రత్యేక ఆకర్షణగా మోడీ తలపాగా
- ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులాతో మోడీ
- పరేడ్ వివరాలను ఎప్పటికప్పుడు వివరిస్తూ కనిపించిన ప్రధాని..


వివరాలు 2లో






## స్వాతంత్ర ఉద్యమ చరిత్ర లేని బిజెపి

- ఉపాధిలో గాంధీ పేరును తొలగించారు
- ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కిన ఘనత
- గాంధీభవన్‌లో జెండా ఆవిష్కరణలో పిసిసి చీఫ్



2 లో

## రాజ్యాంగాన్ని కాలరాసిన ఇందిర

- అదేబాటలో కాంగ్రెస్ పాలకులు
- బిజెపి కార్యాలయంలో జెండా ఎగరేసిన రామచందర్ రావు



2 లో

## స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ధృతరాష్ట్రపాత

- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బొందపెట్టాలి
- బిఆర్ఎస్‌లో చేరిన పలువురు చేవెళ్ల నేతలు
- కార్యకర్తలకు కెటిఆర్ పిలుపు..

**ఏఎం న్యూస్, హైదరాబాద్,జనవరి26:**
స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ధృతరాష్ట్రపాత పోషిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహాభారతంలో ధృతరాష్ట్రుడికి ఏమీ కనిపించనట్లు.. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో సభాపతి అలానే వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని రాష్ట్ర ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో చేవెళ్ల నియోజకవర్గంలోని పలువురు బీజేపీ నేతలు.. బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు కేటీఆర్. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు న్యాయం జరగాలంటే పార్టీ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలన్నారు. రెండోసారి మోసపోతే.. మనం తప్పు చేసిన వాళ్లమవుతామని చెప్పారు. ఈసారి కేసీఆర్ సీఎం అయితే తెలంగాణలో మిగిలిన సమస్యలు పరిష్కారమవుతాయని ఆయన

మిగతా 2లో..




## మేడారాన్ని సందర్శించిన మావోరి తెగ ప్రతినిధులు

గద్దెల ప్రాంగణంలో హాకా నృత్య ప్రదర్శన కళాకారులతో కలిసి నృత్యం చేసిన మంత్రి సీతక్క..

2 లో



# అంబరాన్నంటిన గణతంత్ర వేడుకలు

ఏఎం న్యూస్, న్యూఢిల్లీ,జనవరి26:
దేశ రాజధాని దిల్లీలో గణతంత్ర వేడుకలు అంబరాన్నంటాయి. ఉదయం 10.30 గంటలకు కర్తవ్యపథ్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సైనిక దళాల కవాతు ప్రారంభమైంది. అపాచీతో పాటు ప్రచండ్ తేలికపాటి హెలికాప్టర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పోరులో ధరించే దుస్తులతో అశ్వికదళం తొలిసారి ఈ పరేడ్‌లో పాల్గొంది. ఐరోపా సమాఖ్యకు చెందిన సైనిక విభాగం కూడా ప్రదర్శనలిచ్చింది. దేశ అభివృద్ధి ప్రస్థానం, సాంస్కృతిక వైవిధ్యం, సైనిక బలం, ఆపరేషన్ సిందూర్‌లో వాడిన ప్రధాన ఆయుధ వ్యవస్థలు వంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకలకు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లేయెన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ వేడుకలను వీక్షించేందుకు వేలాది మంది విచ్చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో నిర్వహించిన పరేడ్ భారత సైనిక శక్తి పాటవాన్ని సగర్వంగా చాటిచెప్పింది. ఆపరేషన్ సిందూర్‌లో వాడిన పలు ఆయుధ వ్యవస్థలను సైనిక దళాలు కర్తవ్యపథ్ వేదికగా అచ్చెరువొందేలా ప్రదర్శించాయి. ఈ కవాతులో తొలిసారిగా బ్యాటిల్ అరే ఫార్మేషన్‌లో నిర్వహించిన కవాతు మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. యుద్ధ క్షేత్రంలో సైన్యాల మోహరింపును పోలినట్టు పరేడ్ నిర్వహించడం అతిథులు ఆశ్చర్యపోయేలా చేసింది. ఈ పరేడ్‌లో త్రివిధ దళాలకు చెందిన 6,050 సైనికులు పాల్గొన్నారు. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్ థీమ్‌తో సాగిన ఆయుధ ప్రదర్శన భారత సైనిక పాటవాన్ని జగద్విదితం చేసింది. ఈ వేడుకల సందర్భంగా నాలుగు ఎమ్ఐ-17 హెలికాప్టర్లు పూల వర్షం కురిపించాయి. ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకగా నిలిచిన ఆకాశ్ ఆయుధ వ్యవస్థ, బ్రహ్మోస్ క్షిపణి ప్రదర్శన, 300 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం ఛేదించగలిగే సూర్యాస్త్ర రాకెట్ లాంచర్ అతిథులను ఆకట్టుకున్నాయి. అర్జున్ యుద్ధ ట్యాంకు ప్రదర్శన కూడా ప్రత్యేక అట్రాక్షన్‌గా నిలిచింది. భారత్‌కు అత్యంత



కీలకంగా మారిన ఎస్-400 క్షిపణి నిరోధక వ్యవస్థను కూడా ప్రదర్శించారు. అపాచీ, ప్రచండ్ హెలికాప్టర్లు, వివిధ యుద్ధ విమానాల గగనతల విన్యాసాలు మెప్పించాయి. డ్రోన్ ప్రదర్శన కూడా పరేడ్‌లో జనాలను అమితంగా ఆకట్టుకుంది. ఈ కవాతులో కొత్తగా ఏర్పడిన భైరవ్ లైట్ కమాండో బెటాలియన్ కూడా మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సైనిక కవాతుతో పాటు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల శకటాలు, కళా ప్రదర్శనలు దేశ సాంస్కృతిక వైవిధ్యతను చాటాయి. కేంద్ర ప్రభుత్వ విభాగాలకు చెందిన 30 శకటాలు దేశ ఖ్యాతిని ఇనుమడింపచేశాయి. ఈ వేడుకల్లో దేశం నలుమూలల నుంచి సుమారు 10 వేల మంది అతిథులు పరేడ్‌ను ప్రత్యక్షంగా వీక్షించారు.

దేశంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ధరించిన తలపాగా అందరి దృష్టిని ఆకర్షించింది. అలాగే ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లేయెన్ భారతీయత ఉట్టిపడేలా డ్రెస్ ధరించారు. అయితే మరో అరుదైన దృశ్యం ఆవిష్కృతమయ్యింది. ఉర్సులాకు ప్రధాని మోదీ పరేడు వివరాలను ఎప్పటికప్పుడు వివరించారు. మోదీ వివరాలను ఆమె ఆసక్తిగా విన్నారు. ఇకపోతే ప్రధాని మోదీ ప్రకాశవంతమైన ఎరుపు, పసుపు, ఉదా, ఆకుపచ్చ రంగులు కలగలిసిన తలపాగాను ధరించారు. జరీతో నేసిన బంగారు రంగు మోటిఫ్‌లతో అది ఆకర్షణీయంగా కనిపించింది. ఈ రాజస్థానీ సంప్రదాయ తలపాగా.. పండగ వాతావరణాన్ని ప్రతిబింబించింది. అందులోని ఎరుపు.. అభిరుచి, ఉత్సుకత, ధైర్యసాహసాలకు నిదర్శనంగా చెప్తారు. అలాగే ముదురునీలం, తెలుపు రంగుల్లో ఉన్న కుర్తా పైజామా ధరించారు. పైన లేత నీలంలో ఉన్న జాకెట్ వేసుకున్నారు. మరోవైపు ఉర్సులా.. మెరూన్ రంగులో గోల్డ్ డిజైన్ చేసిన డ్రెస్ ధరించారు. ఈ వస్త్రధారణతో ఈ వేడుక కు తగ్గట్టుగా ఆమెలో భారతీయ సంప్రదాయం ఉట్టిపడింది. ఆమె సాధారణంగా ధరించే ప్యాంట్‌సూట్స్‌కు భిన్నంగా ఈ దుస్తులు వేసుకున్నారు. ఐరోపా సమాఖ్యకు ఉర్సులా తొలి మహిళా అధ్యక్షురాలు. 2019లో తొలిసారి బాధ్యతలు చేపట్టిన ఆమె.. 2024లో రెండోసారి ఎన్నికయ్యారు. 2029 వరకు ఆ బాధ్యతల్లో కొనసాగుతారు. అంతకుముందు ఆమె 2005 నుంచి 2019 వరకు జర్మనీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె ఇండియా-ఈయూ శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. మరోవైపు, భారత్-ఐరోపా యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నాయి. ఈ పర్యటనలో ఆ ఒప్పందం జరిగే అవకాశం ఉంది.

## స్వర్ణాంధ్ర- 2047 లక్ష్యంగా

# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి


**10 సూత్రాల ఆధారంగా కూటమి ప్రభుత్వం అడుగులు**
**సాంకేతికత పాలన కొత్త పుంతలు తొక్కుతోంది**
**ప్రజలకు మరింతం చేరువగా ప్రభుత్వ సేవలు**
**సామాజి పెన్షన్లు, 3 సిటిండర్లతో పేదలకు అండ**
**రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనపై ప్రభుత్వం దృష్టి**
**అమరావతి గణతంత్ర వేడుకల్లో గవర్నర్ అబ్దుల్ నజీర్**

అమరావతి,జనవరి26:
స్వర్ణాంధ్ర- 2047 లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ వెల్లడించారు. 10 సూత్రాల ఆధారంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. సోమవారం రాజధాని అమరావతిలో 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయన జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ.. జీరో పావర్టీ, ఎన్టీఆర్ భరోసా ద్వారా పెన్షన్ అందించి పేదలకు అండగా ఏపీ ప్రభుత్వం ఉంటుందని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సాంకేతికత పాలన కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. సేవలను వేగవంతంగా, జీవనాన్ని సులభంగా, పరిపాలనను మరింత తెలివైనదిగా మార్చుతోందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రతి కార్యక్రమం వెనుక ఉన్న ప్రధాన లక్ష్యం ఒక్కటే.. సేవల అందించడం మెరుగుపరచడం, ప్రభుత్వాన్ని ప్రజలకు మరింత చేరువ చేస్తుందన్నారు. దీపం 2.0 ద్వారా ఏడాదికి 3 ఎల్పీజీ సిలెండర్లను ప్రభుత్వం అందిస్తోందని వివరించారు. మహిళలు, ట్రాన్స్‌జెండర్ల కోసం ఉచిత బస్ ప్రయాణ సౌకర్యాన్ని స్త్రీ శక్తి పథకం ద్వారా అందిస్తోందని చెప్పారు. రూ.978 కోట్ల నిధులను ప్రధానమంత్రి స్వనిధి కోసం ఖర్చు చేశామని పేర్కొన్నారు. పది సూత్రాలు అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని వివరించారు. ఇక ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో సామాజిక పెన్షన్లు అత్యంత కీలకమైనవని అభివర్ణించారు. ప్రతి నెలా 63 లక్షల మందికిపైగా ప్రజలకు సామాజిక పెన్షన్లు అందిస్తున్నట్లు గుర్తు చేశారు గవర్నర్. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించిందన్నారు. అలాగే పాపులేషన్ మేనేజ్‌మెంట్‌పై ఈ ప్రభుత్వం దృష్టి పెట్టిందని తెలిపారు. నీటి భద్రత ప్రభుత్వ విధామని చెప్పారు. పోలవరంతో సహా అన్ని ప్రాజెక్ట్‌లు పూర్తి చేయడంపై ప్రభుత్వం ఇప్పటికే దృష్టి కేంద్రీకరించిందని చెప్పారు. పోలవరం-నల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్‌పై ఇతర రాష్ట్రాలకు ఇబ్బంది కలగకుండా ఏపీ ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. రైతుల కోసం ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధతో ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. అందుకోసం పొలం పిలుస్తోంది, రైతన్న మీ కోసం, తదితర కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తోందని ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ వివరించారు. నేటి గణతంత్ర వేడుక చరిత్రాత్మకమని అభివర్ణించారు. తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ప్రజల రాజధాని అమరావతిలో జాతీయ జెండాను ఎగురవేస్తున్నామన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా మన రాష్ట్రానికి స్పష్టమైన దిశ లేకుండా నిలిచిపోయిందని పేర్కొన్నారు. దాంతో రాజధాని నిర్మాణం సైతం ఆగిపోయిందని గుర్తు చేశారు. ఆర్థిక విశ్వాసం దెబ్బతిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలే ? ప్రగతికి నిజమైన శిల్పులని అభివర్ణించారు. ప్రభుత్వ ప్రతి చర్య, ప్రతి సంస్కరణ, ప్రతి సమీక్ష ప్రజల ఆకాంక్షలను నెరవేర్చుతూ వృద్ధిని పునరుద్ధరించడానికే ఉద్దేశించబడిందని స్పష్టం చేశారు. ఈ ప్రయాణం సులభం కాదు.. దీనికి క్రమశిక్షణ, సహనశక్తి, సామూహిక లక్ష్యంపై అపారమైన విశ్వాసం అవసరమయ్యాయన్నారు. ఫలితాలు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రాజెక్టులు ముందుకు సాగుతున్నాయని.. సంస్థలు తిరిగి బలపడుతున్నాయని.. ప్రజల విశ్వాసం మళ్లీ స్థాపితమవుతోందని విశ్వాసం వ్యక్తం చేశారు. పునరుద్ధరణ మార్పు ప్రయాణం ప్రారంభమైందని వ్యాఖ్యానించారు. ఈ దిశను మరింత స్పష్టంగా ముందుకు తీసుకెళ్లేందుకు.. ఈ ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 కార్యాచరణను ఒక స్పష్టమైన దృష్టిలో స్థిరపరిచిందని చెప్పారు. భారత స్వాతంత్య్ర శతాబ్ది నాటికి, బలమైన, సమగ్ర, ప్రపంచ స్థాయిలో పోటీతత్వం గల రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా సుపరిపాలనకు పది సూత్రాలు.. పేదరికం లేని సమాజం, యువగళం, జనాభా నిర్వహణ - మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత, అగ్రి టెక్, మౌలిక సదుపాయాలు, ఇంధనం, బ్రాండ్ ఏపీ, స్వచ్ఛంధ్ర, స్మార్ట్ గవర్నెన్స్ లక్ష్యాలను జస్టిస్ అబ్దుల్ వివరించారు. ఈ పది మార్గదర్శక సూత్రాల ఆధారంగా సాధించిన పురోగతిని, రాష్ట్ర దిశను, గమ్యాన్ని నిర్వచిస్తున్న విజయాలను ప్రజల ముందుంచడం గర్వకారణమని గవర్నర్ అభివర్ణించారు.

అతి త్వరలోనే భారతదేశంలో తొలి క్వాంటం కంప్యూటర్‌ను అమరావతి క్వాంటం వ్యాలీలో ఏర్పాటు చేస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. శ్రీహరికోట పరిసర ప్రాంతాల్లో స్పేస్ సిటీ ఏర్పాటు ద్వారా అంతరిక్ష సాంకేతిక స్టార్టప్‌లు, తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తూ, ఆంధ్రప్రదేశ్‌ను ఆవిష్కరణల అగ్రగామి కేంద్రంగా నిలబెడుతున్నామన్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ కృత్రిమ మేధ , బ్లాక్ చెయిన్ సాంకేతికతలను సమన్వయం చేస్తూ, పాలనలో పారదర్శకతను సామర్థ్యాన్ని మరింత పెంచుతోందని తెలిపారు. ఆరోగ్య రంగంలో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, ఖచ్చితమైన వ్యాధి నిర్ధారణ కోసం ఏఐ ఆధారిత వైద్య నిర్ధారణ సేవలను విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. వాట్సాప్‌లోనే 119 ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయని గుర్తు చేశారు. సర్టిఫికెట్లు పొందడం, సంక్షేమ పథకాల స్థితిని తెలుసుకోవడం, ఫిర్యాదులు నమోదు చేయటం తదితర అంశాలు ఇప్పుడు క్షణాల్లో సాధ్యమవుతున్నాయన్నారు. ఇప్పుడు పాలన ఒక మెసేజ్ దూరంలోనే ఉందని చమత్కరించారు. భారతదేశంలోనే డ్రోన్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ ఎదుగుతోందని చెప్పారు. కర్నూలు జిల్లా ఓర్వకల్‌లో 300 ఎకరాల విస్తీర్ణంలో డ్రోన్ సిటీ నిర్మాణం జరుగుతోందన్నారు. ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమాలు.. ఏపీని దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టే దిశగా సాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సిఎం చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్, మంత్రులు, అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌తో పెరిగిన ఇమేజ్

ఏఎం న్యూస్, హైదరాబాద్,జనవరి26:
భిన్నత్వంలో ఏకత్వం మన ప్రత్యేకత అని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని గవర్నర్ ఎగరవేశారు.పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రజా ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించిందని.. ఈ డాక్యుమెంట్ హైదరాబాద్ ఇమేజ్‌ను మరింత పెంచుతుందని చెప్పారు. రాష్ట్రాన్ని మూడు ఎకనమిక్ జోన్లుగా విభజించి, కీలక రంగాలకు ప్రత్యేకమైన జోన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. మేడారం అభివృద్ధి కోసం రూ.251కోట్లు కేటాయించినట్లు గవర్నర్ వెల్లడించారు. రైతులకు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని, గతేడాది బతుకమ్మ వేడుకలు గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించాయని ఆయన పేర్కొన్నారు. 26 లక్షల మంది రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసినట్లు, ధాన్యానికి బోనస్‌గా రైతులకు రూ.1,780కోట్లు అందజేశామని గవర్నర్ తెలిపారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉందని గర్వంగా చెప్పారు. భూ వివాదాలను పరిష్కరించేందుకు భూభారతి చట్టం తీసుకొచ్చామని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గ్రూప్-1, 2, 3 ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని, ఇప్పటివరకు 62 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని ఆయన తెలిపారు. ఐటిఐలను అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్లుగా మార్చి, తెలంగాణను గ్లోబల్ స్కిల్ హబ్‌గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామని గవర్నర్ పేర్కొన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని గవర్నర్ తెలిపారు.



బ్యాంకుల ద్వారా మహిళలకు రూ.40 వేల కోట్లు సమకూర్చామని, మహిళలను పెట్రోల్ బంక్‌లు, ఆర్టీసీ అ÷-దదె బస్సులకు ఓనర్లుగా చేశామని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటికే 200 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాలు చేశారని వెల్లడించారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చిన ప్రభుత్వం.. 27 ఎకరాల్లో రూ.2వేల కోట్లతో కొత్త ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం చేపట్టిందని గవర్నర్ తెలిపారు. తెలంగాణలో 1.30 కోట్ల కుటుంబాలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, రాష్ట్రంలో 3.35 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నామని జిష్ణుదేవ్ వర్మ చెప్పుకొచ్చారు. ప్రతి నియోజకవర్గానికి 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని, చేనేత కార్మికులకు రూ.5లక్షల బీమా పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని, హిల్ట్ పాలసీతో కాలుష్య పరిశ్రమలను సిటీ బయటకు తరలిస్తామని గవర్నర్ వెల్లడించారు. రిపబ్లిక్ డే వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్ బాబు తదితరులు హాజరయ్యారు. అమెరికా పర్యటనలో ఉండటంతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిపబ్లిక్ డే పరేడ్‌కు హాజరుకాలేదు. సీఎం రేవంత్ రెడ్డి రిపబ్లిక్ డే సందర్భంగా తెలంగాణ ప్రజలకు సోషల్ మీడియా ద్వారా సందేశమిచ్చారు. రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారత రాజ్యాంగం ఆమోదించబడిన ఈ రోజును భారతదేశ చరిత్రలో ముఖ్యమైన సందర్భంగా సీఎం అభివర్ణించారు.

మేడారాన్ని సందర్శించిన

# మావోరీ తెగ ప్రతినిధులు

ఏఎం న్యూస్, ములుగు,జనవరి26:
ప్రపంచ ప్రఖ్యాత శ్రీ సమ్మక్క-సారలమ్మ మహాజాతర సందర్భంగా సోమవారం న్యూజిలాండ్‌కు చెందిన మావోరీ తెగ ప్రతినిధులు మేడారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మేడారం గద్దెల ప్రాంగణంలో మావోరీ తెగ వారి సంప్రదాయ నృత్యమైన 'హాకా' నృత్యాన్ని వారు ప్రదర్శించారు. హాకా నృత్యం అనేది మావోరీ తెగలో యుద్ధానికి సిద్ధమయ్యే సమయంలో తమ సైనికుల్లో ఉత్సాహం నింపేందుకు, శత్రువుల్లో భయాన్ని కలిగించే విధంగా చేసే సంప్రదాయ నృత్యంగా ప్రసిద్ధి చెందింది. ఈ నృత్యంలో ముఖభావాలు, శరీర చలనలు అత్యంత ప్రభావవంతంగా ఉంటాయి. తెలంగాణ?న్యూజిలాండ్ సాంస్కృతిక మార్పిడి కార్యక్రమంలో భాగంగా పంచాయతీ రాజ్, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో మావోరీ తెగ ప్రతినిధులు మేడారం మహాజాతరను సందర్శించారు. హాకా నృత్య ప్రదర్శన సందర్భంగా మంత్రి సీతక్క స్వయంగా కళాకారులతో కలిసి నృత్యం చేసి వారి ఉత్సాహాన్ని పెంచారు. సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఆదివాసీ సంస్కృతికి దేశ సరిహద్దులు, భాషలు అడ్డుకావని, ప్రపంచంలోని ఎక్కడైనా ఆదివాసీలు అడవి, ప్రకృతి మీదే ఆధారపడి జీవనం సాగిస్తారని అన్నారు. ఆదివాసీ జీవన విధానం, విశ్వాసాలు ప్రపంచవ్యాప్తంగా ఒకే తత్వాన్ని ప్రతిబింబిస్తాయని ఆమె పేర్కొన్నారు. అనంతరం మావోరీ తెగ ప్రతినిధులను గద్దల వద్దకు తీసుకెళ్లి వన దేవతల దర్శనం చేయించారు. సమ్మక్క సారలమ్మ వన దేవతల వైభవం, చరిత్రను మంత్రి సీతక్క స్వయంగా వారికి వివరించారు. ఈ సందర్భంగా బంగారం, వన దేవతల ప్రసాదాన్ని అందజేసి మావోరీ తెగ ప్రతినిధులను సన్మానించారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ధృతరాష్ట్రపాత

(మొదటి పేజీ తరువాయి)

ఆశాభావం వ్యక్తం చేశారు. చేవెళ్లలో కాలె యాదయ్యను తన మనిషి అనుకుని కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించారని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ గెలిపించిన కొన్ని రోజులకే.. ఆయన కాంగ్రెస్ గూటికి వెళ్లాడంటూ మండిపడ్డారు. యాదయ్య పార్టీ మారినట్లు ఆధారాలున్నాయని.. ఆయనపై వేటు వేయాలని స్పీకర్‌ను కోరామన్నారు. కానీ యాదయ్య.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని స్పీకర్ అంటున్నారని పేర్కొన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, యాదయ్యలు చిన్ననాటి నుంచీ దోస్తులని.. వీరిద్దరూ ఒకే బండిపై తిరిగేవారని కేటీఆర్ చెప్పుకొచ్చారు.చేవెళ్లలో ఐదేళ్ల అబ్బాయిని అడిగినా.. కాలె యాదయ్య పార్టీ మారాడనే చెబుతారన్నారు. కానీ స్పీకర్ మాత్రం ఆయన బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని చెబుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు.. తాము పార్టీ మారామని చెప్పే దమ్ములేదని కేటీఆర్ అన్నారు.ఎన్నికల ప్రచార సమయంలో చేవెళ్లలో దళితులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే చాలా హామీలు ఇచ్చారని చెప్పారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్. ప్రతీ దళిత కుటుంబానికి రూ.12 లక్షలు కాదు కదా.. కనీసం 12 పైసలు కూడా ఇవ్వలేదన్నారు. వృద్ధులకు పింఛన్లు పెంచుతామని చెప్పి మోసం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ అందరినీ కడుపులో పెట్టుకుని చూసేవారని వివరించారు. నాట్లు వేసే సమయంలో టింగ్ టింగ్‌మంటూ రైతుల అకౌంట్‌లలో రైతుబంధు పడేదంటూ ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై నిలదీస్తుంటే.. తమపై కేసులు పెట్టి బూతులు మాట్లాడుతున్నారని విమర్శించారు. బూతులు తమకూ వచ్చన్న ఆయన.. మాట్లాడేందుకు సంస్కారం అడ్డొస్తోందన్నారు. ప్రజల దయతో తామంతా మంత్రులమయ్యామని కేటీఆర్ చెప్పారు.

# స్వాతంత్ర ఉద్యమ చరిత్ర లేని బిజెపి

ఏఎం న్యూస్, హైదరాబాద్,జనవరి26:



స్వాతంత్య ఉద్యమంలో పాల్గొనని పెద్దలు 2014 నుంచి అధికారంలోకి వచ్చారని, వారు రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మర్శించారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. టీపీసీసీ అధ్యక్షుడు జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ పేరును తొలగించాలని మన్రేగా పథకాన్ని రద్దు చేస్తున్నారని.. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ చిత్రాలు కనిపిస్తాయని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. 2014 వరకు యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను తొలగిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతున్నారని, లౌకికవాదానికి తూట్లు పొడుస్తున్నారని, కులాలు- మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని మహేష్ గౌడ్ ఆరోపణలు గుప్పించారు. కేసీఆర్ హయాంలో తెలంగాణలో ఆర్థిక విధ్వంసం జరిగిందని... సీఎం రేవంత్ రెడ్డి ఆర్థిక విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సూచనలతో తెలంగాణను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. కుల సర్వేతో యావత్ రాష్ట్రాలు తెలంగాణ వైపు చూస్తున్నాయని తెలిపారు. బీసీలకు 40 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. కులగణన బిల్లులను బీజేపీ అడ్డుకుంటోందని, బీజేపీ కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాలని టీపీసీసీ చీఫ్ కోరారు. మహాత్ముడి ఆధ్వర్యంలో స్వాతంత్య్ర పోరాటం విజయవంతమైందని, ప్రపంచం గర్వించదగ్గ రాజ్యాంగాన్ని అంబేద్కర్ రాశారన్నారు. మహాత్మా గాంధీ కలలు నెరవేర్చే దూరదృష్టి ఉన్న వ్యక్తి నెహ్రూ అని ప్రశంసించారు. ఐరన్ లేడీ ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ దేశానికి గట్టి పునాదులు వేశారని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంత్రులు డాక్టర్ అజారుద్దీన్, షబ్బీర్ అలీ సహా వీహెచ్, దానం నాగేందర్, సంపత్, కోదండరాం, బెల్లయ్య నాయక్, చిన్నారెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని కాలరాసిన ఇందిర

ఏఎం న్యూస్, హైదరాబాద్,జనవరి26:



రాజ్యాంగంలో కల్పించిన మౌలిక హక్కులను మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కాలరాశారని.. ఇందిరా, రాజీవ్ గాంధీల బాటలోనే రాహుల్ గాంధీ నడుస్తున్నారని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. భారతీయులకు మాత్రమే ఓటు హక్కు ఉండాలని... ఇతర దేశాలకు చెందిన వారికి ఓటు హక్కు ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చాలా మంది రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు చేశారని... నెహ్రూ రాజ్యాంగాన్ని పక్కకు పెట్టారని విమర్శించారు. మొదటిసారి రాజ్యాంగాన్ని అవమానించింది నెహ్రూ అని... అంబేద్కర్‌ను అవమానించారని ఆరోపించారు. అంబేద్కర్‌ను ఓడించిన చరిత్ర కాంగ్రెస్‌ది అంటూ విరుచుకుపడ్డారు.సీఐఆర్ పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. గ్రామీణ ఉపాధి పథకంలో కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. పేదలకు మేలు చేయాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని తెలంగాణ బీజేపీ చీఫ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ 60 ఏళ్లపాటు దేశాన్ని దోచుకుందని.. పేదలకు మేలు చేసే పథకాలను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని రాష్ట్ర బీజేపీ చీఫ్ విమర్శించారు. రేవంత్ రెడ్డిపై క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. అంబేద్కర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం భారతరత్న ఇవ్వలేదని గుర్తుచేశారు. అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని గౌరవించింది మోదీ ప్రభుత్వమని ఆయన వెల్లడించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రైతులకు ఏమీ చేయలేదని, ప్రధాని కిసాన్ యోజన ద్వారా రైతులకు మోదీ మేలు చేస్తున్నారని పేర్కొన్నారు. మజ్లిస్‌తో కలిసి కాంగ్రెస్ పని చేస్తోందని... కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు అవినీతి పార్టీలంటూ వ్యాఖ్యలు చేశారు. రెండు పార్టీలను తరిమికొట్టి బీజేపీని ఆదరించాలని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో ఎంపీ లక్ష్మణ్ సహా పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లిలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

– రాజ్యాంగ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత...

– టిపిసిసి అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :

భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు డివిజన్లలో దేశభక్తి వాతావరణం నెలకొంది. కైతలపూర్, బాలాజీనగర్, గాయత్రినగర్, బాలానగర్, ప్రకాష్ నగర్ డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన 77వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాలకు పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మహనీయుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించి స్థానిక నాయకులతో కలిసి జాతీయ పతాకాలను ఆవిష్కరించి జాతీయ గీతం ఆలపించారు. ఈ సందర్భంగా శ్రీరంగం మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశానికి



మార్గదర్శకమని, సమానత్వం, న్యాయం, సౌభ్రాతృత్వం వంటి విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. ఎందరో మహానుభావుల త్యాగాలు, కృషితో ఏర్పడిన రాజ్యాంగాన్ని పరిరక్షించడం మన అందరి కర్తవ్యం అన్నారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి ప్రాథమిక హక్కులు కల్పించి సాధికారతను అందించింది అన్నారు. భిన్నత్వంలో ఏకత్వం మన దేశ బలమైందని, అన్ని వర్గాల హక్కులను దృష్టిలో ఉంచుకుని సామాజిక న్యాయం సాధించాలనే దృక్పథంతో డా. బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని ఆయన పేర్కొన్నారు. గణతంత్ర స్ఫూర్తిని గౌరవిస్తూ ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణరాజ్ పుత్, అల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు మొయినుద్దీన్, గణేష్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పన్నాల రాజశేఖర్ రెడ్డి తదితరులతో పాటు బాలయ్య, మస్తాన్ రెడ్డి, శేఖర్ గజానంద్, హేమంత్, సృంజిత్ గౌడ్, అరుణ్ గౌడ్, బాలాజీ మనోహర్, అశోక్, శ్రీనివాస్ రెడ్డి, రమాదేవి, పులి శ్రీకాంత్ పటేల్, పులి శివకుమార్ గౌడ్, మాట్టే ప్రసన్న కుమార్, మహేందర్, రాము గౌడ్, మధు మోహన్, శ్రీకాంత్ ముదిరాజ్, జహంగీర్, సుంకన్న, విట్టల్ రెడ్డి, కనకయ్య, జమీల్, స్థానిక కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జనసేన పార్టీ కార్యాలయంలో ఘనంగా గణతంత్ర వేడుకలు

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



77వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా కూకట్‌పల్లి కెపిహెచ్‌బి కాలోని 5వ ఫేస్ తెలంగాణ జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్ విచ్చేసి 77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా జనసైనికులు, వీర మహిళల సమక్షంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం పారిశుద్ధి కార్మికులను శాలువాతో సత్కరించి గౌరవించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాధారం రాజలింగం, ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, మచ్చ సుధాకర్, శిరీష,వివిధ నియోజకవర్గా నాయకులు, జనసైనికులు, విరమహిళలు పాల్గొన్నారు.

## రామకృష్ణ వీధిలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జెండా వందన కార్యక్రమానికి అధ్యక్షులు కార్యదర్శి కార్యదర్శి జెండా ఆవిష్కరణ కార్యక్రమము నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులు కూకట్పల్లి సిఐ కెవి సుబ్బారావు ఎస్సై చంద్రశేఖర్ పాల్గొన్నారు. సిఐ ఎస్ఐ లకు రామకృష్ణ వెల్ఫేర్ కమిటీ మేమంటూ సీట్లు అందజేయడం జరిగింది. అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ మా కాలనీలో ప్రతి సంవత్సరం జెండా కార్యక్రమము కాలనీవాసులు కమిటీ సభ్యులు సమక్షంలో నిర్వహించుకున్నాం అన్నారు. ఘన స్వాతంత్ర వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహించుకున్నాం పాల్గొన్న కాలనీవాసులకు సీఐ వెంకట సుబ్బారావు స్వీట్లు పండ్లు బిస్కెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్ శ్రీధర్ రావు, జి ప్రసాద్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, పురుషోత్తం, నరేందర్ రెడ్డి, శ్రీనివాసరావు, సుధాకర్ కిషోర్ సునీల్ పటేల్ వెంకటేశ్వరరావు రాఘవేందర్ సూర్యనారాయణ కేవీ రావు తదితరులు పాల్గొన్నారు.

### పి.సాయినాథ్ యాదవ్ ఏర్పాటుచేసిన వేడుకలలో

## పాల్గొన్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



1947 ఆగస్టు 15 స్వాతంత్రం పొందినప్పటికీ, భారతదేశం తన సొంత రాజ్యాంగాన్ని రూపొందించుకొని దానిని అమలు తెచ్చిన తర్వాతే పూర్తిగా గణతంత్ర రాజ్యాంగ మారింది. అటువంటి గణతంత్ర దినోత్సవ వేడుకలను జూబ్లీహిల్స్ నియోజకవర్గం కంటెస్టెంట్ కార్పొరేటర్ అభ్యర్థి(యూసఫ్ గూడ ) పి. సాయినాథ్ యాదవ్ యూసఫ్ గూడా ఎక్స్ రోడ్ లో 77 గణతంత్ర దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమానికి సాయినాథ్ యాదవ్ ఆహ్వాన మేరకు జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యే వి నవీన్ యాదవ్ హాజరై, జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సాయినాథ్ యాదవ్ తో పాటు బి.రాజ్ కుమార్, సీతారామన్ ( బేకరీ ఓనర్), ముస్తఫా, సురేందర్ యాదవ్ తోపాటు శ్రీనగర్ కాలనీ వెంకటేశ్వర స్వామి ఆలయ సభ్యురాలు కల్యాణి పాల్గొన్నారు. జనగణమన గీతాన్ని ఆలపించి తమ దేశభక్తిని చాటారు. కార్యక్రమానికి వచ్చిన అందరికీ స్వీట్స్ పంచిపెట్టారు సాయినాథ్ యాదవ్ టీం. ఈ సందర్భంగా నవీన్ యాదవ్ మాట్లాడుతూ దేశ పరిపాలనకు ఆధారం అయిన రోజు( గణతంత్ర దినోత్సవం రోజు) ఈ రోజు అని అన్నారు. సాయినాథ్ యాదవ్ మాట్లాడుతూ మేము పిలవగానే ఈ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కి సంబంధించిన కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, బస్తీ ప్రాంతవాసులు పాల్గొన్నారు.

### వివిధ ప్రాంతాలలో జాతీయ జెండాను

## ఆవిష్కరించిన మన్నె గోవర్ధన్ రెడ్డి

ఎ ఎం న్యూస్ ఖైరతాబాద్:



ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వం ద్వారా పరిపాలన జరిగిన రోజు గణతంత్ర దినోత్సవం. అటువంటి గణతంత్ర దినోత్సవాన్ని(77వ) ఖైరతాబాద్ నియోజకవర్గం పలుబస్తీలు, కాలనీలలో ఘనంగా నిర్వహించారు బస్తీల నాయకులు. ఈ కార్యక్రమానికి బస్తీల నాయకుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా ఖైరతాబాద్ నియోజకవర్గ బి ఆర్ ఎస్ పార్టీ మన్నె గోవర్ధన్ రెడ్డి పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మన్నె గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుల అమూల్య త్యాగాలను స్మరిస్తూ, ఐక్యతతో ముందుకు సాగుతూ దేశాభివృద్ధిలో బాధ్యతాయుత భాగస్వాములమవుదాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల నాయకులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అధ్యక్షులు పి. విజయకుమార్

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



సిద్ధార్థ నగర్ కాలనీ(జూబ్లీహిల్స్ నియోజకవర్గం) సంక్షేమ సమితి ఆధ్వర్యంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. కాలనీ సంక్షేమ సమితి అధ్యక్షులు పి. విజయ్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గణతంత్రం అంటే కేవలం ఒక రోజుకు పరిమితం కాకుండా, ప్రతి పౌరుడు రాజ్యాంగ విలువలను తన జీవితంలో అమలు చేయడమే నిజమైన గణతంత్ర భావన" అని అన్నారు. యువత దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని పిల సమాజంలో శాంతి, ఐక్యత, పరస్పర గౌరవం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే కాలనీ అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతి నివాసి భాగస్వామి కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



### గణతంత్ర దినోత్సవ వేడుకలను

## ఘనంగా నిర్వహించిన విక్రమ్ సింగ్, వారి టీం

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



భారతదేశం 1950 జనవరి 26 పూర్తిస్థాయిలో గణతంత్ర రాజ్యాంగ మారినందుకు జరుపుకునే జాతీయ పండుగ. అటువంటి గణతంత్ర దినోత్సవ వేడుకలను శనివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం శ్రీనగర్ కాలనీ డివిజన్ ఆర్బిఐ క్వార్టర్స్ లో విక్రమ్ సింగ్,వారి టీం,జాతీయ జెండాను ఏర్పాటు చేసి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ ను ఆహ్వానించి, వారిచే జాతీయ జెండాను ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జై సింగ్, పవన్ సింగ్, సూరజ్ సింగ్ పాల్గొని జనగణమన గీతాన్ని ఆలపించి తమ దేశభక్తిని చాటారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరికి దేశభక్తి లోగో ఉన్న బ్యాడ్జీలను అందజేశారు విక్రమ్ సింగ్, వారి టీం. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ గణం అంటే ప్రజలు, తంత్రం అంటే పాలనా విధానం అని అన్నారు.ఈ సందర్భంగా జై సింగ్ మాట్లాడుతూ దేశ పరిపాలనకు ఆధారం అయిన ఈ రోజు గణతంత్ర దినోత్సవం అని అన్నారు. మేము పిలువగానే మా ఈ కార్యక్రమంలో పాల్గొన్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాము అని అన్నారు.

### సోమాజిగూడ డివిజన్‌లో పలు ప్రాంతాల్లో

## జెండా ఎగరవేసిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే..

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



గణం అంటే ప్రజలు తంత్రం అంటే పాలన విధానం, (ప్రజల చేత ప్రజల కోసం ఎన్నుకో బడిన పాలన అని అర్థం) అటువంటి 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం సోమాజిగూడ డివిజన్‌లోని పలు ప్రాంతాలు అయిన ఎల్లారెడ్డిగూడ అమీర్పేట్ సర్కిల్ వద్దతో పాటు శ్రీ గంగాధర భక్త సమాజ్ వద్దతో పాటు సంజయ్ గాంధీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ వద్ద తో పాటు హబీబాగు వద్ద, తో పాటు కుమారి కాక చౌరస్తా లో సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కిరణ్ యాదవ్( కొమరవెల్లి మల్లన్న ఆలయ మాజీ సభ్యుడు), సమక్షంలో జాతీయ జెండాను ఎగురవేశారు జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్. ఈసందర్భంగా ఎమ్మెల్యే వి.నవీన్‌యాదవ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న ప్రజాస్వామ్యం. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ, దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ నసీర్, సయ్యద్ జావిద్ హుస్సేన్, సయ్యద్ తాహెర్, షేక్ నజీబ్ పాల్గొని జన గణ మన గీతాన్ని పాడి తమ దేశభక్తిని చాటారు. వచ్చిన ప్రతి ఒక్కరికి మిఠాయిలు పంచిపెట్టారు అధ్యక్షుడు కిరణ్ యాదవ్.

### ఉత్తీర్ణులకు సర్టిఫికెట్లు జారీ చేసిన

## రెవ. డాక్టర్ సిన్ హా, వారి టీం

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



ఎల్షా – దాయ్ బైబిల్ కాలేజ్. ఇండియా తరపున కొడపాక గ్రామంలో గత సంవత్సరము నుండి అనగా 11 / 04 / 2025 నుండి 08 /01 / 2026 వరకు జరిగి సెకండ్ బ్యాచ్ లో 30 మంది యువతి యువకులకు శిక్షణ తరగతులు పూర్తి చేయబడ్డాయి. ఇందులో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈరోజు( 22/01/2026)నాడు అభి శక్తులైన దైవజనులచే, సంఘ పెద్దల సమక్షంలో 30 మంది యువతీ యువకులకు అభిషేకించి ఎల్షదాయ్ బైబిల్ కాలేజ్ ఇండియా. వారు సర్టిఫికెట్ జారీ చేసారు. ఈ ఆర్డినేషన్ కార్యక్రమంలో వాక్య సందేశం అందించినవారు రేవ. డాక్టర్, సిన్ హా. అభిషేకింపబడిన దైవజనులు రెవ రవికుమార్ . బైబిల్ టీచర్ కె. సాంసన్ . ఆర్చ్ బిషప్. మోజస్ విజయవంతం చేశారు ఈ కార్యక్రమంలో ఎల్షా – దాయ్ బైబిల్ కాలేజ్. డైరెక్టర్ బి. స్వామి దాసుతో పాటు ప్రిన్సిపల్ కె.కిరణ్ పాల్గొన్నారు.



## రోజుకు ఒక రూపాయి పోస్టర్ ఆవిష్కరణ

ఏఎం న్యూస్ / యాదగిరిగుట్ట :



సోమవారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో యాదాద్రి భువనగిరి జిల్లా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం నూతనంగా అందిస్తున్న రోజుకు ఒక రూపాయి ఆర్థిక భరోసా కు సంబంధించిన పోస్టర్ మరియు బాండ్ ఆవిష్కరణ చేయడమైనది, ఈ భరోసా వలన యాదాద్రి జిల్లా లో ఫోటో గ్రాఫర్స్ అందరికి ఆర్థిక సహాయం అందుతుంది తన కుటుంబ సభ్యులకు కూడా సహాయ అందించే దిశగా నిర్ణయించారు, ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు భోగ.చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చిల్లా.హరిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు యమల.అప్పల రెడ్డి, జిల్లా అధ్యక్షులు బొమ్మగాని.గణేష్, జిల్లా ఉపాధ్యక్షులు చాట్లపల్లి.సిద్ధు, పందిరి రమేష్, జిల్లా PRO భేతి రవి కుమార్, రామన్నపేట PRO భాషమల్ల సంతోష్ కుమార్, యాదగిరిగుట్ట మండల అధ్యక్షుడు కర్రే.శ్యామ్, ప్రధాన కార్యదర్శి కందోజు.రవి కిరణ్, భోగ.శేఖర్, సంతోష్, స్వామి నాయక్, యాదగిరిగుట్ట మండల ఫోటోగ్రాఫర్స్ తదితరులు పాల్గొన్నారు.

### ఎల్.ఎన్. నగర్‌లో జెండా ఆవిష్కరణలో

## పాల్గొన్న మాగంటి సునిత గోపీనాథ్..

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



గణం అంటే ప్రజలు, తంత్రం అంటే పాలన విధానం( ప్రజల చేత ప్రజల కోసం ఎన్నుకోబడిన పాలన అని అర్థం). అటువంటి గణతంత్ర దినోత్సవ వేడుకలను జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని యూసఫ్ గూడ డివిజన్ పరిధి లోని ఎల్ ఎన్ నగర్ (లక్ష్మీనరసింహనగర్)లో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ తలారి వెంకటేష్, సత్యనారాయణ (సత్తి ) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంటెస్ట్ డ్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ ని ఆహ్వానించారు. నిర్వాహకుల పిలుపుమేరకు మాగంటి సునీత గోపినాథ్ వేడుకలలో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూసఫ్ గూడ డివిజన్ కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్ పాల్గొన్నారు. జనగణమన గీతాన్ని ఆలపించి ప్రతి ఒక్కరూ తమ దేశభక్తిని చాటారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, సోషల్ వర్కర్ వడ్లకొండ కనకయ్య గౌడ్, తో పాటు పంతం రాజు, మైనారిటీ నాయకులు సాబీర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కి సంబంధించిన వివిధ హోదాల నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరికి దేశభక్తి సంబంధించిన స్టిక్కర్లు ఉన్న బ్యాడ్జీలను అందజేశారు తలారి వెంకటేష్. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి మిఠాయిలు పంచిపెట్టారు సత్తి ( సత్యనారాయణ).

### గణతంత్ర దినోత్సవ వేడుకలను

## ఘనంగా నిర్వహించిన షేక్ అబ్దుల్ ఘని, వారి టీం

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



దేశవ్యాప్తంగా జెండా వందనాన్ని కవాతులతో ఘనంగా జరుపుకునే రోజు గణ తంత్ర దినోత్సవం. అటువంటి 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను సోమవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం హెచ్ ఎఫ్ నగర్(హబీబ్ ఫాతిమా నగర్) పేస్ 2 అధ్యక్షుడు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అబ్దుల్ ఘని ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. స్థానికుల మధ్య, మైనారిటీ నాయకుల మధ్య, విద్యార్థిని విద్యార్థుల మధ్య జాతీయ జెండాని ఎగరవేసి తమ దేశభక్తిని చాటారు. ఈ సందర్భంగా పేస్ 2 అధ్యక్షుడు అబ్దుల్ ఘని మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజు ఈ రోజు( గణతంత్ర దినోత్సవం జరుపుకునే రోజు) అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి స్వీట్స్ పంచి పెట్టారు అబ్దుల్ ఘని, వారి టీం.

### కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో

## ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కూకట్పల్లి నియోజకవర్గంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. టి పి సి సి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి శ్రీబండి రమేష్ ముఖ్యఅతిథిగా నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో స్థానిక నాయకులతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జాతిపిత మహాత్మా గాంధీ రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు, అల్లూరి సీతారామరాజు, పార్టీనేత పి.జనార్దన్ రెడ్డి విగ్రహాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు .ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ఎందరో స్వాతంత్ర పోరాటయోధుల త్యాగమే మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యం అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద రిపబ్లిక్ దేశంగా భారత్ వెలుగొందటం మనందరికీ గర్వకారణమన్నారు. పార్టీ నాయకులతో పెద్ద ఎత్తున జాతీయ పతాకాలతో ర్యాలీ నిర్వహించారు. భారత్ మాతాకీ జై అంటూ నాయకులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మార్కెటింగ్ కమిటీ మెంబెర్స్, టెంపుల్ కమిటీ మెంబర్స్ , డివిజన్ అధ్యక్షులు ,బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు , యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, మైనారిటీ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు, బీసీ సెల్ నాయకులు ,సేవ్ దళ్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### ప్రజా ఆలోచన వేదిక ఆధ్వర్యంలో

## కళాశాల టాపర్స్‌కి నగదు పారితోషకం అందజేత

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :




ప్రజా ఆలోచన వేదిక ఆధ్వర్యంలో కూకట్‌పల్లి లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న ఐదుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రు. 5000/- చొప్పున పారితోషకాన్ని అందజేశారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజా ఆలోచన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పల గోపాలరావు తరపున ఒక్కో విద్యార్థికి పారితోషకం చెక్కులను అందజేశారు. కూకట్ పల్లి ప్రభుత్వ కళాశాలలో 2020– 25 ఎకడమిక్ ఇయర్ బ్యాచికి చెందిన బిఎస్సి విభాగంలో అస్మా బేగం, బిఏ విభాగంలో కే. దివ్య, ఇంగ్లీష్ విభాగంలో బొమ్మిడి హరిప్రియ, తెలుగు విభాగంలో జై మోహన్ బాబు, హిందీ సబ్జెక్టులో టాపర్ గా మార్కులు సాధించిన ఎండి అఫ్జల్ అన్సారీ లకు చెక్కులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చందన అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కరుణాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా ఆలోచన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పల గోపాలరావు మాట్లాడుతూ సమాజంలో ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు ప్రతి ఏడాది ఇచ్చే విధంగా ఐదు విభాగాలలో ఒక్కొక్కరికి రు. 5000/- చొప్పున పారితోషకాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.

# భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యుత్తమమైనది

– ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోవిందు నరేష్

ఏ ఎం న్యూస్, హైదరాబాద్ :
భారత దేశ చారిత్రక, సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులకనుగుణంగా దేశ ప్రజలందరికీ దిక్సూచిగా నిలిచే గొప్ప రాజ్యాంగాన్ని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించారని, ఇంత గొప్ప రాజ్యాంగాన్ని చూసి భారత ప్రజలందరూ గర్వపడాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోవింద్ నరేష్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను దప్పు మల్లికర్జున్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గోవిందు నరేష్ మాదిగ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎన్నో రాజ్యాంగాలు ఉనికిలో ఉన్నప్పటికీ అనేకమంది మేధావులు అత్యుత్తమమైన రాజ్యాంగంగా భారత రాజ్యాంగాన్ని కీర్తించారని తెలిపారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా భారత దేశంలో ఉందని , అనేక కులాలు, మతాలు, భాషలు ఆచారాలు సంస్కృతులు సాంప్రదాయాలతో ఇలా ఎన్నో వైరుధ్యాలు ఉన్నప్పటికీ మేమంతా భారతీయులం అనే ఐక్యతా స్ఫూర్తిని 150 కోట్ల మంది భారతీయుల్లో నిలుపుతున్నది కేవలం భారత రాజ్యాంగం మాత్రమే అని అన్నారు. ఈ రాజ్యాంగం ఏ ఒక్క కులానికో , మతానికో, వర్గానికో అనుకూలంగా లేదని మొత్తం దేశ ప్రజలందరి ప్రయోజనాలకు అనుగుణంగా ఉందని అన్నారు. ఇలాంటి గొప్ప రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరి మీద ఉందని అన్నారు . అయితే రాజ్యాంగం ఎంత గొప్పదైనప్పటికీ దానిని అమలు చేసే వారికి చిత్తశుద్ధి లేకపోతే దాని ఫలాలు ప్రజలకు అంబేద్కర్ అన్నారని అందుకు అనుగుణంగానే కొన్ని వ్యవస్థలు రాజ్యాంగానికి లోబడి పని చేయడం లేదని అన్నారు . అందుకు స్పష్టమైన సాక్షంగా కర్ల రాజేష్ లాకప్ డెత్ నిలుస్తుందని అన్నారు రాజ్యాంగ పరిధిలో చట్ట ప్రకారం పనిచేయాల్సిన పోలీసులే చట్టాన్ని ఉల్లంఘించి దళిత సామాజిక వర్గానికి చెందిన కర్ల రాజేష్ ను చట్టవిరుద్ధంగా కస్టడీలోకి తీసుకొని తీవ్రంగా చిత్రహింసలు పెట్టి లాకప్ డెత్ చేశారని అన్నారు. చట్టాలు ప్రజలందరికీ వర్తింపజేస్తున్న పోలీసు వ్యవస్థ వారికి మాత్రం వర్తింప చేసుకోవడం లేదు. ఈ ఘటన జరిగి రెండు నెలలు దాటినా కర్ల రాజేష్ మరణానికి ప్రధాన కారకుడైన చిలుకూరు ఎస్సై సురేష్ రెడ్డిని నేటికే సస్పెండ్ చేయడం లేదని అన్నారు . ఇది పూర్తిగా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైనటువంటి చర్య. నిజంగా రాజ్యాంగం పట్ల గౌరవం ఉంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కర్ల రాజేష్ మరణానికి ప్రధాన కారకుడైన చిలుక ఎస్సై సురేష్ రెడ్డిని సస్పెండ్ చేయాలని ఈ ఘటనలో పాల్గొన్న ప్రతి ఒక్కరిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం దేశ ప్రజలందరూ ఐకమత్యం తో ముందుకు సాగాలని అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితోనే ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని మందకృష్ణ మాదిగ మూడు దశాబ్దాలుగా నడిపిస్తున్నారని అన్నారు. ఇంత గొప్ప రాజ్యాంగం రాసిన అంబేద్కర్ ను రాజ్యాంగంలో దళితులు , పీడితులు, అణగారిన



వర్గాలకు రావాల్సిన హక్కుల కోసం అంబేద్కర్ కు తోడుగా రాజ్యాంగ పరిషత్ సభ్యుడిగా నిలబడిన బాబు జగ్జీవన్ రామ్ ను ప్రజలు మర్చిపోవద్దని పిలుపునిచ్చారు. ఈ యొక్క కార్యక్రమంలో ఎం ఎస్ పి హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు టీవీ నరసింహారావు మాదిగ, కొండపల్లి శివ, ఎడ్ల మల్లేష్ , సూరారం సుజాత , గజాల రాజశేఖర్ , బేకి సత్యనారాయణ , జంగిలి మల్లేష్ , గ్యార శ్రీహరి , చాలగూడ దేవేందర్ , మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.



## 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్

ఏ ఎం న్యూస్ ఓయూ:




77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నాచారం hmt నగర్ డివిజన్ పరిధిలో పలు కాలనీల్లో బస్తీల్లో ఏర్పాటు చేసిన జెండా వందనం కార్యక్రమాల్లో పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేసిన జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ ఈ సందర్భంగా గోపాల్ గౌడ్ మాట్లాడుతూ... మన స్వేచ్ఛ స్వాతంత్ర్యం కోసం అసువులు బాసిన సమరయోధుల దీక్ష, దక్షితలను స్మరించుకుటూ... ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా... భారతదేశం అవతరించిన శుభదినం నేడే అని గోపాల్ అన్నారు. భారత రాజ్యాంగం మనకు ఇచ్చిన స్వేచ్ఛ, హక్కులు, బాధ్యతలను గుర్తు చేసుకునే ఈ గర్వకారణమైన రోజున, దేశాభివృద్ధికి, సమాజ సేవకు ప్రతి ఒక్కరం బాధ్యతగా నిల బడాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు గోపాల్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు చంద్రమౌళి, రాజి రెడ్డి, యోగేశ్వర్ రెడ్డి, గంధమల్ల గోపి, రమేష్, సురేందర్, నవీన్ గౌడ్, మొర నర్సింహా రెడ్డి, వెంకట రమణ,నవీన్ చింటు, క్రాంతి కుమార్, సురేష్,వీరాస్వామి, మహేందర్,మంజులవాణి, కళావతి, పార్వతి, అరుణ మరియు డివిజన్ బిజెపి నాయకులు, స్థానికులు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఏ ఎం న్యూస్ ఓయూ:




గణతంత్ర దినోత్సవ వేడుకలను లాలాపేట లక్ష్మీ నగర్ లోని శ్రీ దుర్గా హైస్కూల్లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ ఎం. నరసింహారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రంగు రంగుల దుస్తులు ధరించిన విద్యార్థులు దేశ భక్తి, జానపద గీతాలకు అనుగుణంగా డ్యాన్సుతో అదరగొట్టారు. ఈ వేడుకల్లో స్కూల్ ప్రిన్సిపాల్ స్వరూపారాణి, ఉపాధ్యయ బృందం పాల్గొన్నారు.



## జిహెచ్ఎంసి వర్కర్‌ను మేయర్‌గా
# గెలిపించడమే ఆర్పీఐ పార్టీ లక్ష్యం

ఏ ఎం న్యూస్ ఓయూ:



రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో ఆర్పిఐ (భీమ్ రావ్అంబేద్కర్) పార్టీ మేయర్ అభ్యర్థి గా జిహెచ్ఎంసి వర్కర్ ను గెలిపించడమే తమ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ అన్నారు. సోమవారం తార్నాక లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం ఆవరణలో 77 గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి జిహెచ్ఎంసి వర్కర్లకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల ఇంచార్జి మేజర్ డాక్టర్ చంద్రకాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ భూస్వాములు సంపన్నుల ప్రయోజనాల కోసం రేవంత్ రెడ్డి జిహెచ్ఎంసి పరిధిని విస్తరించి 300 వార్డులు చేశాడని లక్షల కోట్ల రూపాయల సంపాదన ధ్యేయంగా ఈ విస్తరణ జరిగిందని జిహెచ్ఎంసి లో ప్రభుత్వ భూములను సంపదను పేదలకు పంచి హైదరాబాద్ ను దేశ రెండో రాజధానిగా ఢిల్లీ స్థాయిలో అభివృద్ధి చేసి ప్రపంచ స్థాయి నగరాలతో పోటీ పడే విధంగా అభివృద్ధి చేయడమే తమ పార్టీ విధానమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లెర్ల మైసయ్య, మహిళా వింగ్ అధ్యక్షులు కావేరి, వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ ఏజాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొంటా బాబు, అసైన్డ్ భూముల రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్, ఎస్.టి వింగ్ రాష్ట్ర అధ్యక్షులు కీలాష్ నాయక్ తో పాటు బల్దియా వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

## హెడ్ కానిస్టేబుల్ సాగర్ల మట్టయ్యకు ఉత్తమ ఉద్యోగ అవార్డు

ఏ ఎం న్యూస్ ఓయూ:



నాచారం పోలీస్ స్టేషన్ లోని హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న సాగర్ల మట్టయ్యకు ఉత్తమ ఉద్యోగ అవార్డుకు ఎంపికయ్యారు. రిపబ్లిక్ డే సందర్భంగా మేడ్చల్ మల్కాజిరి కలెక్టర్ మిక్కిలేనేని మను చౌదరి చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. పోలీసు విభాగంలో 23 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూ విధి నిర్వహణలో నిజాయితీ క్రమశిక్షణ అంకితభావం ఉత్తమ సేవను గుర్తించి ఈ ప్రశంస పత్రాన్ని పొందిన మట్టయ్యను నాచారం పోలీస్ స్టేషన్ సిబ్బంది అభినందించారు.

## నాచారంలోని శాంతి గార్డెన్స్‌లో
## అపార్ట్మెంట్ వాసులు అందరు కలిసి వందేమాతరం గేయం

ఏ ఎం న్యూస్ ఓయూ:
వందేమాతరం గేయం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నాచారం లోని శాంతి గార్డెన్స్ లో అపార్ట్మెంట్ వాసులు అందరు కలిసి వందేమాతరం గేయం ఆలపించారు. రిపబ్లిక్ డే సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరించిన అనంతరం అపార్ట్మెంట్ వాసులు 150 ఆకారం లో నిలబడి వందేమాతరం పాడి తమ దేశభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమ సమయంలో భారతీయులను స్వతంత్ర సమరం వైపు నడిపించిన గేయం అని గుర్తుచేసుకున్నారు., విప్లవకారులు నవ్వుతూ ఉరికంభంల వైపు తీసుకెళ్లి, రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కూల్చివేసేందుకు స్ఫూర్తి ఇచ్చిన అసాధారణమైన గేయం 'వందేమాతరం'. అన్నారు. ఇప్పటికి కూడా భాష, ప్రాంతం, మతం, కులం, వర్గం వంటి వాటితో సంబంధం లేకుండా భారతీయులు అందరికీ ఉత్తేజం కలిగించే గీతం వందే మాతరం అన్నారు. భారత మాతను ఇంతకన్నా ఘనంగా కీర్తించి, సమర్పించుకొనే గేయం మరొకటి లేదన్నారు.

## సర్కిల్ 19 కార్యాలయంలో జాతీయ జెండాను
## ఆవిష్కరించిన ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్..

ఎ ఎం న్యూస్ జూబ్లీహిల్స్ :



యూసఫ్ గూడా(జూబ్లీహిల్స్ నియోజకవర్గం) లోని సర్కిల్ 19 అనేది ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్( జిహెచ్ ఎంసి) కార్యాలయానికి సంబంధించిన ప్రాంతం. ఇది ప్రభుత్వ సంస్థగా గుర్తింప బడింది. అటువంటి యూసఫ్ గూడా సర్కిల్ 19 కార్యాలయంలో ఇటీవలే నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ కమిషనర్ సురేష్ సమక్షంలో 77 వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ జాతీయ జెండాను సోమవారం ఆవిష్కరించారు. జనగణమన జాతీయ గీతాన్ని పాడి అక్కడ ఉన్న వారందరూ తమ దేశభక్తిని చాటారు. ఈ కార్యక్రమంలో డి. ఈ. శ్రీనివాస్ ( శానిటేషన్), రాజశేఖర్ (డి పి వో ), డి. ఈ. భానుచందర్ ( ఇంజనీరింగ్), సంతోష్ (డి. ఈ ), భరత్ (ఏ. ఈ ), తో పాటు జిహెచ్ఎంసి సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యూసఫ్ గూడ స్థానిక వాసి, కంటెస్టెడ్ కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాయినాథ్ యాదవ్ పాల్గొన్నారు.

## ఫేస్ 1లో జాతీయ జెండా వద్ద యువకులు

ఏ ఎం న్యూస్ జూబ్లీహిల్స్:



మన దేశ నాయకులు చేసిన త్యాగాల గురించి తెలుసుకొని, స్వాతంత్రం తేవడానికి అమరవీరులైన కథనాలను తెలుసుకొని, జాతీయ జెండా పట్ల గౌరవాన్ని దేశభక్తిని తెలుసుకుంటూ యువత ముందుండాలి. అటువంటి విలువలను తెలుసుకుంటూ ప్రస్తుతం యువత గణతంత్ర దినోత్సవ వేడుకలు పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం పటాన్చెరు నియోజకవర్గం తెల్లాపూర్ పరిధిలోని కొల్లూరు ఫేస్ 1 యువకులు. కొల్లూరు ఫేస్ వన్ లోని మొదటి బ్లాక్ అధ్యక్షురాలు కుమారుడు బేతపూడి చరణ్ తో పాటు వారి మిత్రులు పండు, పృథ్వి, యశ్వంత్,నిఖిల్, శ్రీరామ్, భరత్ లతో కలిసి 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుగుతున్న కొల్లూరు ఫేస్ 1 సముదాయంలోని జెండా వద్దకు వెళ్లి జనగణమన పాడి తమ దేశభక్తిని చాటారు. ఈ సందర్భంగా చరణ్ మాట్లాడుతూ దేశం ముందు, తర్వాత మనం అని అన్నారు.

## చింతల్ బస్తీలో ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు

ఏ ఎం న్యూస్ ఓయూ:



76వ రిపబ్లిక్ డే వేడుకలు తార్నాక చింతల్ బస్తి లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు .76 సంవత్సరాలు దాటినప్పటికీ రాజ్యాంగంలో పొందుపరిచినటువంటి హక్కులని కాలరాస్తున్నటువంటి ప్రభుత్వాన్ని వ్యతిరేకించాలని రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని నాయకులు సుద్దాల సురేష్ పేర్కొన్నారు. రాజ్యాంగంలోని హక్కులని కాపాడుకోవాలి అరిజన, గిరిజన బడుగు బలహీన వర్గాల హక్కులని కాపాడుకోవాలని 33 శాతం స్త్రీలకు ఇచ్చినటువంటి రిజర్వేషన్ మహిళలు గుర్తించాలని రాబోయే రోజుల్లో బహుజనులు ఏకమై రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని హక్కులను కాపాడుకోవాలన్నారు. ప్రతి ఇంట్లో రాజ్యాంగం ఉండాలని ప్రతి రోజు రాజ్యాంగాన్ని చదువుకోవాలి హక్కులను తెల్చుకోవాలి యువత నడుం బిగిస్తూ ముందుకు నడవాలని తార్నాక చింతల్ బస్తి పెద్దలు, సుద్దాల సురేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుద్దాల సురేష్ , టి. లక్ష్మణ్, ఎం. రాజయ్య, అప్సర్, ఎండి షాబు ద్దీన్, రైముద్దీన్, గూడ నర్సింగ్ రావు,రాజు, వెంకటేష్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## విజయ డైరీలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

ఏ ఎం న్యూస్ ఓయూ:



లాలాపేట్ లోని విజయ డైరీలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనరల్ మేనేజర్ కామేష్ హాజరై జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తులను పెంచేందుకు ప్రభుత్వం ప్రణాళికతో ముందుకు వెళుతుందన్నారు. చైర్మన్, ఎండి ఆధ్వర్యంలో విజయ డైరీ ప్రగతి పథంలో నడిపించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అంగన్ వాడి కేంద్రాలకు పాల ఉత్పత్తులను ఇప్పటికే సరఫరా చేస్తున్నామని తెలిపారు. మిడ్ డే మిల్ కు పాల ఉత్పత్తులను ఇచ్చే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇప్పటికే నాలుగు లక్షల లీటర్ల పాలను ఉత్పత్తి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగస్తులు,కార్మికులు పాల్గొన్నారు.

## హైకోర్టు బార్ కౌన్సిల్ ఎన్నికల్లో
## ప్రముఖ న్యాయవాది రాపోలు అభినవ్‌ను గెలిపించాలి

– ఓయూ జేఏసీ నాయకుడు గడ్డం అశోక్..

ఏ ఎం న్యూస్ ఓయూ:



తెలంగాణ హైకోర్టు బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ప్రముఖ న్యాయవాది రాపోలు అభినవ్ ను గెలిపించాలని ఓయూ జేఏసీ నాయకుడు గడ్డం అశోక్ కోరారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద రాపోలు అభినవ్ ను గెలిపించాలని కోరుతూ కార్యక్రమాన్ని చేపట్టాడు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హైకోర్టులో మెంబర్షిప్ కలిగినటువంటి న్యాయవాదులు రాపోలు అభినవ్ కు ఓటు వేసి గెలిపించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో న్యాయవాదుల పైన అతి క్రూరంగా దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. గతంలో కరీంనగర్ లో ఒక న్యాయవాది పైన విచక్షణ రహితంగా దాడి చేసి అతి క్రూరంగా చంపడం జరిగిందన్నారు. ఈ విషయంలో అప్పటి ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని ప్రజల కోసం కొట్లాడే రాపోలు అభినవ్ లాంటి న్యాయవాదికి గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క న్యాయవాదిపై ఉందన్నారు.

# ఓయూ ఎంబీఏ కాలేజీలో పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశం

ఏ ఎం న్యూస్ ఓయూ:





ఓయూ క్యాంపస్‌లోని ఎంబీఏ కాలేజీలో ఆదివారం ఓకాంబా వార్షిక సమావేశం విజయవంతంగా నిర్వహించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అనంతరం పూర్వ విద్యార్థులు ఆడిటోరియానికి చేరుకొని అధికారిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఓకాంబా గౌరవ చైర్మన్, ప్రస్తుత విభాగాధిపతి ప్రొఫెసర్ వై. జహంగీర్ పూర్వ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పూర్వ విద్యార్థుల సహకారంతో ప్లేస్‌మెంట్లు, ఇంటర్న్?షిప్ అవకాశాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని వివరించారు. ఫ్యాకల్టీ ఆఫ్ మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ డి. శ్రీరాములు పూర్వ విద్యార్థులకు తన అభినందనలు తెలియజేస్తూ, సంస్థతో వారి నిరంతర అనుబంధాన్ని ప్రశంసించారు. బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ జి. విద్యాసాగర్ రావు, విద్యార్థులు, సంస్థ సర్వతోముఖాభివృద్ధి కోసం ఓకాంబా లక్ష్యాలను సాధించేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు, గత కార్యవర్గ సభ్యులు, ప్రస్తుత కార్యవర్గ సభ్యులు ఉపాధ్యక్షుడు కె. వంశీ, ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, ఖజాంచి డాక్టర్ శ్రీనివాస్ హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా, ఓకాంబా అలుమ్ని అసోసియేషన్ అకడమిక్ టాపర్లకు పతకాలను ప్రదానం చేసింది. ప్రత్యేక అతిథిగా హాజరైన ఎన్.వి.ఎస్. రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఏ విద్యాసంస్థకైనా విలువైన ఆస్తులని పేర్కొన్నారు. ఈ సమావేశం పూర్వ విద్యార్థులు, సంస్థ మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడం, జ్ఞాన వినిమయం, విద్యాభివృద్ధికి సంబంధించిన చర్చలతో ముగిసింది.

# చిత్రపరిశ్రమకు వచ్చే వారిని ప్రోత్సహించాలి

## ఇక్కడ కాస్ట్ కౌచింగ్ అంటూ ఏదీ లేదు

సినిమా ఇండస్ట్రీలోకి వచ్చి పనిచేస్తానని ఏ ఆడబిడ్డ, మగబిడ్డ అయినా అంటే వారిని ప్రోత్సహించి పంపాలని, తెలుగు సినీ ఇండస్ట్రీ గొప్పదని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. జీవితాంతం ప్రేక్షకులను అలరిస్తూనే ఉంటానని తెలిపారు. ఆయన కీలక పాత్రలో అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మన శంకరవరప్రసాద్‌గారు' భారీ విజయాన్ని అందుకుని రూ.300 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టింది. ఈ సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ సభలో చిరంజీవి మాట్లాడారు. మళ్లీ విజయోత్సవాలను జరుపుకొనే వైభవాన్ని తీసుకొచ్చిన ఘనత దర్శకుడు అనిల్ రావిపూడికి దక్కుతుంది. ఇంతటి ఘన విజయాన్ని అందించిన తెలుగు సినీ ప్రేక్షకులకు ధన్యవాదాలు. సినిమా టీమ్ విజయానందాన్ని అనుభవిస్తుంటే, నాకూ సంతోషంగా ఉంది. అనిల్‌ను చూస్తుంటే రాఘవేంద్రరావుగారు గుర్తుకు వచ్చేవారు. రోజూ సెట్‌లో వినోదాన్ని పంచేవారు. ఈ మూవీ షూటింగ్‌కు వెళ్తుంటే ఎంతో ఆనందంగా ఉండేది. ప్రతి సినిమా కష్టపడి పనిచేస్తాం. కానీ, కొన్ని సినిమా ఫలితాలు ఉత్సాహాన్ని ఇస్తాయి. అలాంటిదే ఈ మూవీ. ఈ సంక్రాంతికి దాదాపు అన్ని సినిమాలను ఆదరించారు. సినిమాలో వెంకీ ఉండాలని కోరుకున్నా. దాన్ని అనిల్ సాకారం చేశాడు. ఎంత పెద్ద స్టార్‌నైనా హ్యాండిల్ చేసే సామర్థ్యం అనిల్ రావిపూడికి ఉంది. మళ్లీ అనిల్‌తో చేసే అవకాశం మా ఇద్దరిలో ఎవరికి వస్తుందో చూడాలి. ఇక నా కుమార్తె ఇండస్ట్రీలోకి వస్తానంటే ప్రోత్సహించిన తొలి వ్యక్తి మా అబ్బాయి రామ్‌చరణ్. 'రంగస్థలం' కాస్ట్యూమ్స్ డిజైనర్‌గా పనిచేసింది. కష్టం ఒక్కటే ఆయుధమని తెలుసుకున్న వ్యక్తి నా కుమార్తె సుస్మిత. సినీ ఇండస్ట్రీ అద్దంలాంటిది. మనం ఎలా ఉంటామో అలాంటి ఫలితాన్నే ఇస్తుంది. ఎవరైనా సరే సినీ ఇండస్ట్రీలోకి వస్తానంటే వారిని ప్రోత్సహించాలన్నారు.. క్యాస్టింగ్ కౌచ్‌లాంటివి ఉండవు. నువ్వు ప్రొఫెషనల్‌గా ఉండాలి. కొత్త టాలెంట్‌కు ఎప్పుడూ ప్రోత్సాహం లభిస్తూనే ఉంటుంది. ఇందులో చేసిన ప్రతి నటుడు, సాంకేతిక నిపుణుడు ఎంతో ఉత్సాహంగా నటించారు. నయనతార సినిమాలో చేయడమే కాదు, ప్రమోషన్స్ కూడా చేసింది. ఆ మెరిట్ కూడా అనిల్‌కే దక్కుతుంది. సినిమా పరుగులు పెట్టడానికి ఎడిటర్ తమ్మిరాజు కారణం. ఇటీవల ఒకామె మాట్లాడిన వీడియో చూసి, భావోద్వేగానికి గురయ్యా. 'ఏమయ్యా.. చిరంజీవి ఎప్పటి నుంచో కష్టపడుతూనే ఉన్నావు. మమ్మల్ని ఆనందింపజేయడానికి



ఓపిక ఉన్నా లేకపోయినా ఇప్పటికీ అలాగే పనిచేస్తున్నావు. డబ్బుల కోసం నువ్వు పనిచేస్తున్నావని నేను అనుకోను. నువ్వు ఇలా కష్టపడుతుంటే నాకు బాధగా ఉంది' అని అన్నారు. నిజంగా ఆ తల్లికి ఈ సభాముఖంగా ధన్యవాదాలు చెబుతున్నా. చిరంజీవి మమ్మల్ని అలరించాలనే కోరుకునే మీ పాజిటివ్ ఎనర్జీ నుంచే నాకు ఈ శక్తి వస్తోంది. ఈ జన్మ ఉన్నంత వరకూ మిమ్మల్ని అలరిస్తూనే ఉంటాను అని చిరంజీవి అన్నారు.

## సెలెక్టెడ్‌గానే ఐటమ్ సాంగ్స్ చేస్తా: రష్మిక



ఒకప్పుడు సినిమాల్లో ఐటం పాట అంటే ప్రత్యేకంగా ప్రొఫెషనల్ డాన్సర్లే గుర్తొచ్చేవారు. ఆ పాటల్లో వాళ్లు కనిపిస్తేనే హిట్ అనే స్టాండర్డ్ ఉండేది. కానీ కాలం మారింది. ఇప్పుడు అదే సినిమాలో హీరోయిన్‌గా నటించిన నటీమణులే ఐటం సాంగ్స్‌లోనూ స్టెప్పులేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఒకే సినిమాలో హీరోయిన్ పారితోషికంతో పాటు స్పెషల్ సాంగ్ ఫీజు కూడా అందుకుంటూ డబుల్ లాభం పొందుతున్నారు. ఈ ట్రెండ్‌కు అనుగుణంగానే గత కొన్నేళ్లుగా సమంత, కాజల్ అగర్వాల్, తమన్నా, పూజా హెగ్డే, శ్రీలీల వంటి స్టార్ హీరోయిన్లు ఐటం పాటల్లో కనిపించి సెన్సేషన్ క్రియేట్ చేశారు. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లోనూ ఇదే ట్రెండ్ బలంగా కొనసాగుతోంది. ముఖ్యంగా పెద్ద సినిమాల్లో ఐటం సాంగ్ అంటే స్టార్ హీరోయిన్ ఉండాల్సిందే అనే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే 'నేషనల్ క్రష్'గా గుర్తింపు పొందిన రష్మిక మందన్నా కూడా ఈ దారిలోకి అడుగుపెట్టింది. బాలీవుడ్ డెబ్యూ 'గుడ్‌బై'లో నటిగా మెప్పించిన ఆమె, తర్వాత వచ్చిన 'థామా' చిత్రంలో నటనతో పాటు స్పెషల్ సాంగ్‌లోనూ తనదైన స్టైల్‌లో ఆకట్టుకుంది. ఆ పాట తర్వాత రష్మికపై ఐటం భామగా కూడా డిమాండ్ పెరిగింది. దర్శక, నిర్మాతలు 'హీరోయిన్‌గా తీసుకున్నా, ఐటం సాంగ్‌కు కూడా ఒప్పించొచ్చు' అనే ధీమాతో ఆమె వైపు చూస్తున్నారనే టాక్ వినిపించింది. కానీ ఇదే సమయంలో రష్మిక ఒక కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తాను నటిగా అయినా, ఐటం భామగా అయినా కేవలం ఇద్దరు దర్శకుల సినిమాల్లో మాత్రమే స్పెషల్ సాంగ్స్ చేస్తానని, అంతకుమించి ఈ విషయంలో చాలా సెలెక్టివ్‌గా ఉంటానని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయం టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా రష్మికపై భారీ ఆశలు పెట్టుకున్న కొంతమంది దర్శకులు ఈ షరతులతో కాస్త నిరాశకు గురైనట్లు సమాచారం. తెలుగులో లేడీ ఓరియెంటెడ్ సినిమా 'మైసా'లో కీలక పాత్రలో నటిస్తుండగా, విజయ్ దేవరకొండ 14వ సినిమాలోనూ హీరోయిన్‌గా ఎంపికైంది. మరోవైపు బాలీవుడ్‌లో 'కాక్‌టెయిల్ 2' వంటి పెద్ద ప్రాజెక్ట్‌లో నటిస్తోంది. నటిగా, డాన్సర్‌గా తనను తాను విభిన్నంగా ప్రెజెంట్ చేసుకుంటూనే, అవసరమైతేనే ఐటం పాటలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలన్నదే రష్మిక స్టాటజీగా కనిపిస్తోంది.

## మరోసారి పోలీసు అధికారిగా రాణిముఖర్జీ



మహిళల అక్రమ రవాణా.. కిడ్నాప్ లాంటి అంశాలతో రూపొంది మంచి హిట్ బొమ్మ అనిపించుకున్నాయి 'మర్దానీ' చిత్రాలు. ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్ రాజ్‌ఫిల్మ్స్ నిర్మించిన ఈ సినిమాలు ఇప్పటికే రెండు భాగాలుగా విడుదలై ప్రేక్షకుల్ని మెప్పించాయి. తాజాగా ఈ ఫ్రాంఛైజీలో 'మర్దానీ 3' రాబోతోంది. రాణి ముఖర్జీ మరోసారి పోలీసు అధికారిణి శివానీ రాయ్ పాత్రలో కనిపించనున్నారు. జనవరి 30న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

## తరుణ్ భాస్కర్ ఓం శాంతి శాంతి శాంతిః

తనపై పెత్తనం చెలాయించే భర్తకి ఓ భార్య ఎలా బుద్ధి చెప్పింది.. అతడి అహంకారాన్ని ఎలా అణిచింది అనే నేపథ్యంలో సాగే కథ 'ఓం శాంతి శాంతి శాంతిః'. తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా జంటగా నటించిన ఈ సినిమాని ఏఆర్ సజీవ్ తెరకెక్కించారు. ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ సంస్థలు నిర్మించాయి. బ్రహ్మాజీ, సురభి ప్రభావతి తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. జనవరి 30న థియేటర్లలోకి రానుంది.




# mana Cinemalu

## ఇరుముడితో రవితేజ కొత్త మూవీ



మాస్ మహారాజ్ రవితేజ కెరీర్ గత కొన్నేళ్లుగా ఆశించిన స్థాయిలో సాగడం లేదు. వరుసగా సినిమాలు చేస్తున్నప్పటికీ, ప్రేక్షకుల్లో ఆ సినిమాలు పూర్తి సంతృప్తిని కలిగించలేకపోయాయి. మాస్ ఇమేజ్‌కు కాస్త విరామం ఇచ్చి, క్లాస్ టచ్‌తో చేసిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' కూడా సంక్రాంతి బరిలో పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. దీంతో రవితేజ తదుపరి ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ క్రమంలోనే ఆయన దర్శకుడు శివ నిర్వాణతో చేతులు కలిపారు. ఈ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి'. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా నుంచి గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. అయ్యప్ప స్వామి మాలధారణలో రవితేజ కనిపించిన లుక్ సోషల్ మీడియాలో మంచి స్పందన తెచ్చుకుంది. పోస్టర్ చూసిన వెంటనే ఒక డివోషనల్ ఫీల్, పాజిటివ్ వైబ్స్ కలుగుతున్నాయన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. అయ్యప్ప మాలధారణలో ఇరుముడికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యతను ఈ సినిమాలో ఎమోషనల్‌గా, డీప్‌గా చూపించబోతున్నారని సమాచారం. సెన్సిటివ్, క్లాస్ కథనాలతో పేరు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈసారి డివోషనల్ టచ్‌తో కథను తెరకెక్కిస్తుండటంతో అంచనాలు మరింత పెరిగాయి. మాస్‌కు భిన్నంగా, కంటెంట్ ఓరియెంటెడ్ సినిమా ద్వారా రవితేజ కొత్త ఇమేజ్‌ను ఆవిష్కరించబోతున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రానికి జీ.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. 'ఇరుముడి' రవితేజ కెరీర్‌కు టర్నింగ్ పాయింట్ అవుతుందా అన్నది అభిమానుల్లోనూ ఆసక్తి పెరుగుతోంది.

### నీల్-ఎన్టీఆర్ కాంబినేషన్

## డ్రాగన్ తుదిదశకు షూటింగ్

### జూన్ 25న విడుద లచేసేలా ప్లాన్

యంగ్ టైగర్ ఎన్టీఆర్ స్టార్ దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ పాన్-ఇండియన్ సినిమా పై తాజాగా క్రేజీ అప్‌డేట్ బయటికి వచ్చింది. వర్కింగ్ టైటిల్: డ్రాగన్ పేరుతో ఎన్టీఆర్ కెరీర్‌లోనే అత్యంత భారీ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రస్తుతం షూటింగ్ దశలో దూసుకుపోతోంది. తాజాగా ఈ సినిమా ప్రస్తుత షెడ్యూల్ షూటింగ్ హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో విజయవంతంగా పూర్తయింది. ఈ షెడ్యూల్‌లో ఎక్కువగా నైట్ ఎఫెక్ట్‌తో నైట్ షూటింగ్ నిర్వహించారని టాక్. తదుపరి షెడ్యూల్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానున్నట్లు సమాచారం. ప్రశాంత్ నీల్ అంటేనే భారీ యాక్షన్, డార్క్ టోన్, పవర్‌ఫుల్ ఎలివేషన్లు గుర్తుకు వస్తాయి. అదే ఫార్ములాను ఈసారి ఎన్టీఆర్ స్థాయికి మించి చూపించేందుకు దర్శకుడు ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమా ప్యూర్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది. ఇందులో యాక్షన్ సీక్వెన్సులు అత్యంత ఇంటెన్స్‌గా ఉండబోతున్నాయట. ఎన్టీఆర్ కెరీర్‌లోనే బెస్ట్ యాక్షన్ రోల్స్‌లో ఇది ఒకటిగా నిలుస్తుందనే టాక్ వినిపిస్తోంది. ఇప్పటి వరకు ప్రశాంత్ నీల్ తెరకెక్కించిన అన్ని సినిమాల్లోకెల్లా ఇదే బెస్ట్ మూవీ అవుతుందన్న అంచనాలు బలంగా ఉన్నాయి. ఈ భారీ ప్రాజెక్ట్‌ను టాలీవుడ్‌లో టాప్ ప్రొడక్షన్ హౌసెస్‌గా గుర్తింపు పొందిన మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి నిర్మిస్తున్నాయి. భారీ బ్జడెట్‌తో, పాన్-ఇండియా స్థాయిలో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. రవి బస్రూర్ చిత్రానికి సంగీతం అందిస్తుండగా, ఇందులో కథానాయికగా రుక్మిణి వసంత్, కీలక పాత్రలో అనిల్ కపూర్ కనిపించనున్నారు. భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న ఈ సినిమా అన్ని భాషల్లో ప్రేక్షకులను ఆకట్టుకునేలా పాన్-ఇండియన్ ప్రాజెక్ట్‌గా రూపొందుతోంది. జూన్ 25 సినిమాని విడుదల చేసే ప్లాన్ చేస్తున్నారు.

## 30న వస్తున్న విజయ్ సేతుపతి గాంధీ టాక్స్

టాకీ యుగం ప్రారంభమైన తర్వాత వచ్చిన అతి తక్కువ ప్రయోగాత్మక చిత్రాల్లో 'పుష్పక విమానం' ఒకటి. ఆ కోవలో మళ్లీ ఇన్నేళ్ల తర్వాత మూవీ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది 'గాంధీ టాక్స్'. విజయ్ సేతుపతి, అదితీరావ్ హైదరీ, అరవింద్ స్వామి ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రమిది. కిశోర్ పాండురంగ్ బేలేకర్ దర్శకత్వం వహించారు. ఇప్పటికే పలు చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై ప్రశంసలు అందుకుందీ సినిమా. ఈ నెల 30న థియేటర్లలో విడుదల కానుంది. ఏఆర్ రెహమాన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు.

### మయసభ 30న విడుదల

'తుంబాడ్' వంటి వైవిధ్యమైన కథతో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచిన దర్శకుడు రాహి అనిల్ బార్వే. ఇప్పుడు మరో సరికొత్త కథాంశంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఆయన దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'మయసభ'. జావేద్ జాఫ్రీ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జనవరి 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'బంగారం వేటకు మీకు స్వాగతం' అంటూ చిత్ర బృందం విడుదల చేసిన ప్రచార చిత్రం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. వీణా జామ్కర్, దీపక్ దామ్లే తదితరులు నటిస్తున్నారు.

## ఖైదీ-2పై అనుమానలొద్దన్న లోకేశ్

ఎవరూ ఊహించని విధంగా టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ తో కోలీవుడ్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ సినిమా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో, కార్తితో చేయాల్సిన 'ఖైదీ 2'ను లోకేశ్ ఆపేశారంటూ ఇటీవల రూమర్స్ వచ్చాయి. వాటిపై దర్శకుడు స్పందించారు. చెన్నైలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన క్లారిటీ ఇచ్చారు. అల్లు అర్జున్ సినిమా తర్వాత 'ఖైదీ 2'నే తెరకెక్కిస్తానని వెల్లడించారు. ఖైదీ-2 ఉంటుందని, అనుమానాలు వద్దన్నారు.

